# దివ్య సామరస్యం

## అపసామరస్యం మూలంలో సామరస్యం ఉంది

విషయాలు మనకు కనబడినట్టుగా ఉండవు. మీరు ఏ విషయానికైనా పైపైనే చూస్తుంటే, దానికి తక్కువ అర్థం ఉంటుంది. కాని పూర్తి భాగాన్ని చూడండి; అదుగో! ఒక అర్థవంతమైన చిత్రం పుడుతుంది. అలాగే, సృష్టి అనే బ్రహ్మాండ చిత్రం అనంత కాలమానాల తెరపై పరుచుకొని ఉంది. ప్రకృతిలోని ప్రతి వస్తువూ సంఘటనా విశ్వచిత్రకారుడి (భగవంతుడి) నిపుణమైన కుంచె గుర్తు. కాని సాధారణ మానవుడికి గందరగోళపరిచే చెదరుమదురు చిత్రమే కనబడుతుంది.

జరిగే ప్రతి సంఘటనా విశ్వస్వరకర్త కూర్చిన స్వరసమ్మేళనంలో ఒక స్వరంగా భావించండి. మనం సొంతంగా శ్రుతిపరచిన స్వరాలు అర్థం లేనివవుతాయి– మొత్తం కూర్పుతో సంబంధం లేకపోతే. సృష్టికర్త అద్భుత విశ్వగానం ఎల్లవేళలా, అన్నిటిలోను సాగుతూనే ఉంటుంది. సంక్షోభం, చావు, ప్రేమ, జీవం – ఈ కలగాపులగంలో దానికి భాగం ఉంది. ఇవన్నీ లయబద్ధమయిన విశ్వసమశ్రుతిలో కలుస్తాయి. ఈ శ్రుతి, ధ్యానంలో భగవంతునితో అనుసంధానం పొందిన ఆత్మకే వినపడుతుంది. భగవద్గీతలో, విశ్వరూపసందర్శనంలో, శ్రీ కృష్ణ భగవానుడు అర్జునుడికి ఈ విశ్వైక్యతను – భిన్నంగా కనబడే అన్నిటిలో ఉన్న ఏకత్వాన్ని సాక్షాత్కరింపజేశాడు. అనైక్యంగా, మారుతున్నట్లుండే సృష్టిలో భిన్నావస్థలలో మారని ఐక్యతను సందర్శింపజేశాడు. భగవానులు ఇలా అన్నారు: “సర్వవ్యాపకత్వమనే ఆలయంలో దేవతలు, మనుషులు, ప్రకృతితో కూడిన బ్రహ్మాండానికి, విశ్వానికి ఆరాధ్యదైవంగా నన్ను తెలుసుకో!”

ఎంత పరిమితమయినది మానవుడు ఇంద్రియాల ద్వారా తెలుసుకోగలిగిన విషయ పరిధి! మీకు చెవులున్నాయి, కాని అవి నిజంగా వింటున్నాయా? మీకు కళ్ళున్నాయి, కాని అవి నిజంగా చూస్తున్నాయా? మీకు హృదయముంది, కాని అది కచ్చితమైన అనుభూతిని ఇస్తుందా? మీకో ఆత్మఉంది, కాని మీ చేతన ఆ దివ్యత్వపు పరిశుద్ధతను ప్రకటిస్తుందా? చీకట్లో మగ్గేవారు అంధకారంలో బతుకుతారు; పగటి వెలుగులో జీవించేవారు కాంతినే చూస్తారు. ఎవరైతే తమలోని ఆత్మ అంతరంతరాల్లో ఐక్యతను అనుభూతి చెందుతారో వారే సృష్టి మొత్తంలో నడుస్తున్న ఐక్యతలో పాలుపంచుకొంటారు. తమలో అంతర్గతసామరస్యం లేనివారు అదే ప్రపంచంలోనూ లేకపోవడాన్ని చూస్తారు. గందరగోళంలో ఉన్న మనస్సు తన చుట్టూ గందరగోళాన్నే చూస్తుంది. ప్రశాంతతను అనుభూతి పొందనివాడికి శాంతం అంటే ఏం తెలుస్తుంది? ఎవరికైతే అంతఃప్రశాంతత ఉందో వారు ఆ స్థితిలోనే నిరంతరాయంగా ఉంటారు, బయట అభిప్రాయభేదాల మధ్య ఉన్నప్పటికీ.

భారతదేశంలో ఒక గృహస్థయోగిగారు ఉండేవారు. ఆయన భార్య సాక్షాత్తూ కోపం అవతారం ఎత్తినట్లుండేది. సోక్రటీస్‌గారి భార్యకన్నా గయ్యాళి. యోగిగారు చేసే ఏ పనీ ఆవిడకు సంతోషం కలిగించేది కాదు, లేక సరయిన పని అనిపించేది కాదు. ఆవిడ నోటిదురుసుతనాన్ని గురించి చుట్టుపక్కలవాళ్ళు కూడా తరచుగా ఫిర్యాదులు చేస్తుండేవారు. యోగిగారు, స్వభావసిద్ధమయిన తన మంచితనంతో, సురక్షితమయి ఉన్న తన మనశ్శాంతితో, సహనంతో ఆవిడపాటికి ఆవిడను వదిలేస్తుండేవారు – కాలమే ఆవిడలో మార్పు తెస్తుందనే ఆశతో. కాని ఆవిడకు మాత్రం ఈయన గారిపై ఏ మాత్రం సహనం లేదు. ఆచరణాత్మకంకాని ఆయన ఆధ్యాత్మికతను ఏనాటికైనా కచ్చితంగా అంతం చేయాలని ఆవిడ నిశ్చయించుకుంది. ఆయన్ని మార్చడంలో తాను పన్నిన ఘోరమైన ఉపాయాలన్నీ విఫలం కావడంతో, ఆవిడ ఆయన పుస్తకాలన్నిటికీ నిప్పంటించింది. ఆ క్రమంలో, వాళ్ళ ఇంటికి కూడా నిప్పంటుకుంది. ఇది చూసిన యోగిగారు తన భార్య దగ్గరికి వచ్చి ఇలా అన్నారు: “ప్రియమైన దేవీ, నేను నిన్ను మునుపటికంటే ఎక్కువగా ప్రేమిస్తున్నాను. నువ్వు భగవంతుడు పంపగా వచ్చినదానివి. ఇన్నాళ్ళూ నువ్వు నాకు సహనంగా ఉండటం నేర్పావు. ఈ రోజు నా చివరి బలహీనతను – పుస్తకాలు, ఇంటిమీద నాకుండే ప్రేమ అనే అనుబంధాన్ని నయం చేశావు.” శిక్షణ పొందిన ప్రశాంతమయిన ఒక నిజమయిన యోగి మనస్సును ఎవరు కలవరపరచగలరు? ఏది కలవరపరుస్తుంది?

## మనం ఇంద్రధనస్సుల వెనుక పరుగులు పెడుతున్నాం

మనం ఎల్లప్పుడూ దగ్గరగా ఉండే వస్తువులను చూడలేకపోతున్నాం. మన చేతికి అందుబాటులో ఉండే నిధులను వదలి, ఇంద్రధనస్సుల వెనుక పరుగులెడుతున్నాం. మనం అంధకారంలో సురక్షితంగా ఉండటానికి వెతుకుతున్నాం, యథార్థానికి మన తాపత్రయమంతా వెలుగుకోసం. మనం దప్పి తీర్చని బంగారుకలలు కంటాం, మన ఆత్మలు కడపటి వాస్తవం (భగవంతుడి) కోసం దాహం అంటుంటే. మనం ఉనికేలేని నీడపట్టు ఛాయకోసం ఎండమావుల వెంట పరిగెడుతున్నాం. కాని నిజానికి శాంతి ఐక్యతలనే ఒయాసిస్ (ఎడారిలో నీటిచెలమ) మన ఆత్మలోనే ఉన్నాయి.

అనైక్యపు భిన్నత్వం మౌనంగా మనకి సూచన చేస్తుంది – బయట ఉన్నదంతా ఛాయామాత్రపు ఆట అని, నిజమయిన నిధులన్నీ మనలోనే ఉన్నాయని. బయటకుపోయే చంచలమయిన మనస్సును శాంతింపజేయండి, లోపలికి మరల్చండి. మీ ఆత్మకు ఇంతకు ముందుగానే సొంతమయిన, అన్నిటినీ తీర్చే సత్యాన్ని మీ ఆలోచనలతోను, కోర్కెలతోను ఐక్యం చేయండి. అప్పుడు సృష్టిలోను, మీ జీవంలోను అంతర్లీనంగా ఉన్న ఐక్యత చూస్తారు. మీరు మీ ఆశలను, అంచనాలను మీలో ఉన్న అంతర్గత ఐక్యతతో జతపరిస్తే మీరు మీ జీవితాన్ని శాంతి అనే ఉల్లాసపు రెక్కలపై తేలుస్తారు. యోగానికున్న అందము, సంపూర్ణత ఆ విధమయిన నిత్యమయిన సమచిత్తతను అందించడంలో ఉంది.

## సామరస్యం, ప్రేమ జ్ఞానాలనుండి పుడుతుంది

సామరస్యం, ప్రేమ జ్ఞానాలనుండి పుడుతుంది. ఇవి ఒక విధంగా శుద్ధమయిన అందరికీ అందుబాటులో ఉండే హృదయానికి బిడ్డలు. పరిశుద్ధమైన హృదయం శుద్ధమయిన ఆలోచనల ఫలితం. మానసిక శుద్ధత మనస్సు మంచి ఆలోచనలను చెడువాటి నుండి వేరు చేయడం, తద్వారా చెడు ఆలోచనలను నిరాకరించడం, మంచి ఆలోచనలమీదే దృష్టిపెట్టడం అనే ఎంపిక క్రమంనుండి వస్తుంది. మళ్ళీ మళ్ళీ చేయడం ద్వారా, ఆచరించడం ద్వారా గట్టిపరుస్తుండడంవల్ల విచక్షణ ఒక చక్కటి అలవాటవుతుంది. మానసిక సంఘర్షణకు గురిచేసే విభేదించే ఆలోచనలు నిలిచిపోవడంవల్ల, చెడుగా ఆలోచించడం మానడంవల్ల ప్రతి ఒక్కరిలోను బాహ్యమయిన, ఆంతరికమయిన సామరస్యం వస్తుంది. కాబట్టి ఎప్పుడైనా మీ మనస్సు కుటుంబ కలహాలమీద నిమగ్నమయి ఉంటే విచక్షణ ఉపయోగించి వాటిని పరిష్కరించండి. చూడండి! ఇబ్బంది పెట్టే సమస్యలు మీ శాంతినిక భంగం చేయలేవు. యోగాన్ని సాధన చేసేవారికి అనుభవంలోకి వచ్చిన, వారు ఇచ్చిన యోగ్యతాపత్రం ఇది.

మనస్సు ప్రకృతి ప్రసాదించిన భస్మకారి – అందులో మీరు పనికిరాని మానసిక చెత్తనంతా కాల్చేయండి: మీ పనికిరాని ఆలోచనలు, కోరికలు; మీ అపార్థాలు, కష్టాలు; మీ మానవ సంబంధాల్లోని అపశ్రుతులు. ఏ ఒక్క బాంధవ్యమూ–ఎంత మనస్సు విరిగినటువంటిదయినా – మీరు తిరిగి సమాధానపరచాలని మీ మనస్సులో మొదట అనుకుంటే కానిది కాదు. మీ జీవితంలో పరిష్కారం చేయలేమనుకొనే ఒక్క సమస్యకూడా లేదు. ముందుగా మీరు దాన్ని మీలో – దాని జన్మస్థానమయిన మీ మనస్సులో – పరిష్కరించండి. పర్యవసానాలను చూచి భయపడకండి, అవి కఠినంగా ఉన్నప్పటికీ. ఏదైనా పని చేసేముందు, ముందుగానే మీరు మనస్సులో మీ విచక్షణాజ్ఞానాన్ని ఉపయోగించి ఆ పరిస్థితిని చక్కజేసినట్లయితే ఫలితం దానిసంగతి అదే చూసుకుంటుంది. సామరస్యం పొందిన మనస్సు భేదాలున్నట్లుగా కనపడే ఈ ప్రపంచంలో పొందికను కలుగజేస్తుంది.